సర్వేకు ప్రజలందరూ సహకరించాలి


సర్వే మెటీరియల్‌ను ఎన్యుమరేటర్లకు అందజేస్తున్న దృశ్యం

లాలాపేట: సమగ్ర సర్వేకు ప్రజలందరూ సహకరించాలని సికింద్రాబాద్ అసిస్టెంట్ మున్సిపల్ అధికారిణి హేమలత కోరారు. సర్వేకు సంబంధించిన మెటీరియల్‌ను ఆదివారం లాలాపేటలోని తార్నాక వార్డు కార్యాలయంలో అధికారులు హేమలత, శ్రీవాణి ఎన్యుమరేటర్లకు అందజేశారు. అయితే ఈ నెల 6 నుంచే ఈ సర్వే ప్రక్రియ ప్రారంభమైంది. ఇన్ని రోజుల పాటు ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అంటించే కార్యక్రమాన్ని చేపట్టారు. శనివారం నుంచే అసలైన సర్వే అంటే కుటుంబ సభ్యుల వివరాలు సేకరించాల్సి ఉండగా ఈ సర్వేకు సంబంధించిన మెటీరియల్ ఆలస్యంగా వచ్చిందని అధికారులు పేర్కొన్నారు. దీంతో శనివారం నుంచే ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ ఈ సర్వే సోమవారం నుంచి చేపడతామని అధికారులు స్పష్టం చేశారు.

11 నుంచి గురునానక్ 555వ జయంత్యోత్సవాలు


జయంత్యోత్సవాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

రాంగోపాల్‌పేట్: గురునానక్ దేవ్‌జీ ప్రబంధక్ కమిటీ అఫ్జల్‌గంజ్, సికింద్రాబాద్ గురుద్వారా సాహెబ్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 15 వరకు సిక్కుల మత గురువు గురునానక్ 555వ జయంతోత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సికింద్రాబాద్ గురుద్వారాలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సికింద్రాబాద్ ప్రబంధక్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బల్దేవ్ సింగ్ బగ్గా, జగన్మోహన్ సింగ్, అఫ్జల్‌గంజ్ గురుద్వారా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్విందర్ సింగ్ బగ్గా, జోగిందర్‌సింగ్ ముజ్రల్ మాట్లాడారు. 11న సాయంత్రం 4 గంటలకు సికింద్రాబాద్ గురుద్వారా నుంచి నగర్ కీర్తన్ ప్రారంభమై మనోహర్ థియేటర్ మీదుగా క్లాక్‌టవర్, ప్యాట్నీ, ఆర్పీరోడ్, మోండా మార్కెట్, ఆల్ఫా హోటల్ మీదుగా గురుద్వారా వరకు కొనసాగుతుందన్నారు. 13న అఫ్జల్‌గంజ్ అశోక్‌నగర్ గురుద్వారా నుంచి సాయంత్రం 4గంటలకు రెండో నగర్ కీర్తన్ గురుద్వార నుంచి అఫ్జల్‌గంజ్, సిద్ధిఅంబర్‌బజార్, జాంబాగ్, పుత్లీబౌలి, సెంట్రల్ గురుద్వారా గౌలిగూడ మీదుగా అఫ్జల్‌గంజ్ గురుద్వారా చేరుకుంటుందన్నారు. 15న సాయంత్రం 4 గంటలకు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో విశాల్ దివాన్ ఉంటుందని తెలంగాణ నుంచి సుమారు 30వేల మంది సిక్కులు పాల్గొననున్నట్లు చెప్పారు. 14న సికింద్రాబాద్ గురుద్వారాలో రాత్రి 7.30 నుంచి 10.30 గంటల వరకు, 15న అఫ్జల్‌గంజ్ గురుద్వారాలో రాత్రి 9 నుంచి అర్ధరాత్రి 2 గంటల వరకు కీర్తన్ దర్బార్ ఉంటుందని తెలిపారు. అలాగే ఉత్సవాలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్య శిబిరంలో ఎంపీ ఈటల రాజేందర్

అడ్డగుట్ట: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం అడ్డగుట్టలో బీజేపీ జిల్లా సెక్రటరీ మద్దెర్ల శ్యామ్ సుందర్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్, యునాని వైద్యులు పాల్గొని రోగులకు పరీక్షలు నిర్వహించారు. బీఎంఐ, బీపీ, జనరల్ చెకప్, కార్డియాలజీ, ఆర్థోపెడిక్ తదితర పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఈటల రాజేందర్ ఉచిత వైద్య శిబిరాన్ని, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజలు అత్యధికంగా నివాసముండే అడ్డగుట్ట ప్రాంతంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం వారికి ఎంతో ఉపయోగకరమన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు కూడా జోరుగా సాగుతుందని, ప్రజలందరూ పార్టీ సభ్యత్వం తీసుకోవడానికి ముందుకు వస్తుండడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొంతం దీపిక, బీజేపీ సీనియర్ నాయకులు వెంకటరమణి, రవిప్రసాద్ గౌడ్, హరి, నాగేష్‌రెడ్డి, ప్రభు గుప్తా, నరేందర్, ఉదయ్ యాదవ్, వేణుగోపాల్, సాయిబాబా, శివాజీ, రాజేష్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళా ఉత్సవ ప్రదర్శనలు


కళాకారులకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న దృశ్యం

సనత్‌నగర్: వాక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బేగంపేట వైట్‌హౌస్‌లో ఆదివారం కళా ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రీయ నృత్యాలు, స్టాండప్ కామెడీ, సంగీతం, కూచిపూడి తదితర కళల్లో మొత్తం 25 ప్రత్యక్ష ప్రదర్శనలు కొనసాగాయి. ప్రతిభ చాటిన కళాకారులకు భారత ప్రభుత్వ జీవన సాఫల్య అవార్డు గ్రహీత మీనాక్షి పద్మనాభన్, డాక్టర్ సతీశ్ శిఖ, వైష్ణవి పులిపాటి అతిథులుగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వాక్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ క్రాంతి వీరమాచినేని మాట్లాడుతూ కళలు, కళాకారులను ప్రోత్సహించేందుకు యేటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వాక్ ఫౌండేషన్ కల్చరల్ అంబాసిడర్ పులిపాటి చేసిన కూచిపూడి ప్రదర్శన ఆకట్టుకున్నది.

సందడిగా కార్తీక వనభోజన మహోత్సవం



మాట్లాడుతున్న ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మడిపడగ శ్రీనివాస్, కార్తీక వనభోజన మహోత్సవంలో పాల్గొన్న ఆర్యవైశ్య కుటుంబాలు

లాలాపేట: సికింద్రాబాద్ లాలాపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనభోజన మహోత్సవాలు సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. ఇందులో పాల్గొన్న ఆర్యవైశ్య కుటుంబాలు ఆడుతూ పాడుతూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం శాశ్వత గౌరవ అధ్యక్షుడు నేతి రాములు, అధ్యక్షుడు మడిపడగ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పందిరి సాంబశివరావు, కోశాధికారి యెనిశెట్టి భాస్కర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీమహా రుద్రయాగం


స్వామివారికి చక్రస్నానం చేయిస్తున్న వేదపండితులు

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీగిరి తిరుపాదమండపంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీమహా రుద్రయాగం ఆదివారం ముగిసింది. వేదపండితుల నేతృత్వంలో మహాన్యాసం, ఏకాదశ రుద్ర పారాయణం,అభిషేకం, చక్రస్నానం, రుద్రక్రమార్చన, జ్యోతిర్లింగార్చన తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తిభావం పెంపొందించేందుకు, సమస్త జనుల శ్రేయస్సు, విశ్వశాంతి, లోకకల్యాణార్థం భక్తుల కోరిక మేరకు శ్రీమహా రుద్రయాగం నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్తలమండలి అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, వేణుగోపాలరావు, లక్ష్మీనారాయణ, ఈఓ రాజేష్‌కుమార్ తెలిపారు. శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, దాతలు తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు.శ్రీమహా రుద్రయాగాన్ని విజయవంతం చేసిన భక్తులు, ఆధ్యాత్మికవేత్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్తీక మాసంలో ప్రతి శని,ఆదివారాల్లో ఆలయ ప్రాంగణంలో దీపోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. యాగంలో పాల్గొన్న వేదపండితులకు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు బాలభాస్కర్, లక్ష్మీనారాయణ, ఆత్మరామసూర్యసుబ్రహ్మణ్యం, శివశంకరన్, నారాయణన్, సుజయ్‌ప్రకాశ్, షణ్ముకరెడ్డిలతో పాటు భక్తులు, ఆధ్యాత్మికవేత్తలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై చిత్తశుద్ధి లేని సీఎం

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్ మాదిగ


మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న గోవింద్ నరేశ్ మాదిగ తదితరులు

రసూల్‌పురా: ఎస్సీ వర్గీకరణను అమలు చేసి దేశంలోనే తెలంగాణను తొలి రాష్ట్రంగా నిలబెడుతామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించి పది నెలలు గడుస్తున్నా ఇప్పటికీ నెరవేర్చలేదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్ మాదిగ అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి ఇటికె శ్రీకిషన్ మాదిగ ఆధ్వర్యంలో బొల్లారం రిసాలబజార్ అంబేడ్కర్ భవన్‌లో మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి మాలల ఒత్తిడికి తలొగ్గి ఎస్సీ వర్గీకరణను అమల్లోకి తీసుకరావడంలో జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు చెందిన కొంతమంది మాల కులస్తుల ఎమ్మెల్యేలు పార్టీ విధానాన్ని, సీఎం ఇచ్చిన ప్రకటన చేవెళ్ల డిక్లరేషన్‌ను ధిక్కరించి మాట్లాడుతున్నా పార్టీ నుంచి ఎందుకు సస్పెండ్ చేయడం లేదని ప్రశ్నించారు. మాల ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి, కేఆర్.నాగరాజు పెడుతున్న సభల వెనుక సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నారనే అనుమానం తమకు కలుగుతోందన్నారు. ఎస్సీ వర్గీకరణ లేకుండానే టీచర్ల ఉద్యోగాలు భర్తీ చేసి రేవంత్‌రెడ్డి మాదిగ జాతికి ద్రోహం చేశారని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణను వెంటనే అమల్లోకి తేవాలని లేకుంటే మాదిగలు మరో పోరాటం చేస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎస్‌వై. అశోక్, బీజేపీ నాయకులు వంశతిలక్, ఆరెపల్లి పరశురాం, దుబ్బ మురళి, నవీన్ చిన్నా, సునీల్ మాదిగ, శ్రీకాంత్, అజిత్‌క ల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ శైలజ

బౌద్ధనగర్: అంబర్‌నగర్‌లోని శకుంతల స్కూల్ వద్ద జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఆదివారం కార్పొరేటర్ కంది శైలజ పరిశీలించారు. స్థానిక ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా త్వరితగిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అదే విధంగా పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కంది నారాయణ, బస్తీవాసులు పాల్గొన్నారు.

వైభవంగా అభిషేకం.. అర్చన మహోత్సవం

సనత్‌నగర్: మోడల్‌కాలనీ సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో పార్థీవ లింగ అభిషేకం, అర్చన మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. సనాతన ధర్మ బాల సంస్కరణ సమితి ఆధ్వర్యంలో సమితి నిర్దేశించిన ధర్మ సంబంధమైన మార్గనిర్దేశాల మేరకు తల్లిదండ్రులు తమ పిల్లలను తయారుచేసి పంపించారు. ప్రమథ గణాలతో శివపార్వతులు భూసంచారం చేసే ప్రదోష సమయం అయిన సాయంత్రం 5 గంటలకు భక్తిపూర్వక మహోత్సవం జరిగింది. సభ్యులు జన్ను హారిక, బుచ్చిబాబు, సత్యనారాయణ, పావని, మాచారావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అబాకస్ పోటీల్లో విజేతలకు ట్రోఫీలు


ట్రోఫీలతో బాలలు

సికింద్రాబాద్: యూనివర్సల్ కాన్సెప్ట్ మెంటల్ అర్థమెటిక్ సిస్టమ్ ఇనిస్టిట్యూట్ (యూసీఎంఏఎస్) తెలంగాణ ఫ్రాంచైజీ ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలను సికింద్రాబాద్‌లో నిర్వహించారు. అబాకస్ పద్మారావునగర్ ఫ్రాంచైజీ సీవీ లీలావతి ఆదివారం విజేతలందరికీ ట్రోఫీలు పంపిణీ చేశారు. ఈ పోటీల్లో నామాలగుండులోని బాలల పాఠశాలకు చెందిన విద్యార్థులు 33 బహుమతులను గెలుచుకున్నారు. ఇందులో విజేతల్లో సీతాఫల్‌మండికి చెందిన బంగారు పూర్వి చాంపియన్‌షిప్‌ను గెలుచుకున్నారు. మరో 3 చాపియన్‌లు, 5 రన్నర్స్ అప్ మెరిట్‌లు, 25కన్సోలేషన్ బహుమతులను విద్యార్థులు చేజిక్కించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కాంగ్రెస్ హయాంలో పెరిగిన ఆత్మహత్యలు


రాజుసింగ్‌ను సన్మానిస్తున్న ఆటో డ్రైవర్లు

రసూల్‌పురా: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు పెరిగాయని కంటోన్మెంట్ నియోజకవర్గ ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు టీ రాజు సింగ్ పేర్కొన్నారు. తెలంగాణ ఆటో మోటార్స్ ట్రేడ్ యూనియన్ బీఆర్ఎస్ అనుబంధ సంస్థ కంటోన్మెంట్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఇటీవల ఆయన నియామకం కాగా, అన్నానగర్ చౌరస్తా ఆటోస్టాండ్ వద్ద డ్రైవర్లు ఆదివారం రాజుసింగ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ చలాన్లు, జరిమానాలు, కోర్టు కేసులు, బీమా తదితర సమస్యలను డ్రైవర్లు తన దృష్టికి తీసుకువచ్చారని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆటో డ్రైవర్లకు అండగా బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డ్రైవర్లు ప్రశాంత్‌బాబు, ఆస్లాం, కే. రాంచందర్, జీ. రామకృష్ణ, సిద్ధు, బాబు, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: బేగంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రీన్‌పార్కు హోటల్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, దివ్యశక్తి అపార్ట్‌మెంట్స్, శీష్‌మహల్ థియేటర్ మెయిన్‌రోడ్డు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎస్సార్‌నగర్ మెయిన్‌రోడ్డు ఏరియా, కమ్యూనిటీ హాల్ లేన్, ఆంధ్రాబ్యాంక్ లేన్, ఎస్‌బీహెచ్ బ్యాంక్ లేన్, చైతన్య జూనియర్ కాలేజ్, 2ఆర్‌టీ, 3ఆర్‌టీ క్వార్టర్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

లాలాగూడ, బన్సీలాల్‌పేట్ సబ్‌స్టేషన్ల పరిధిలో..

రాంగోపాల్‌పేట్: లాలాగూడ, బన్సీలాల్‌పేట్ సబ్‌స్టేషన్ల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సీబీడీ ప్యారడైజ్ ఏడీఈ ఆదినారాయణరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.ఉదయం10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు లంబాడీబస్తీ, కనకదుర్గా అపార్ట్‌మెంట్, సండే మార్కెట్, విజయ డెయిరీ,గరోడా అపార్ట్‌మెంట్,డేవిడ్ మెమోరియల్ కాలేజ్ ప్రాంతాలు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సీసీనగర్ ఫీడర్ పరిధిలోని ఏజే కాలనీ (1,2), స్వస్తిక్, గాంధీనగర్ కమ్యూనిటీ హాల్, ఉప్పలమ్మ దేవాలయం, ఆర్‌సీ కాంపౌండ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కుల గణనతో తెలంగాణను బలోపేతం చేద్దాం

లాలాపేట: ప్రజాస్వామ్యానికి, అభివృద్ధికి ఎంతో కీలకమైన కుల గణనపై బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం కుల వ్యతిరేక సర్వే అంటూ ప్రచారం చేస్తుందని, బీజేపీ ఏకంగా కుల గణననే వ్యతిరేకిస్తుందని సమాజ్‌వాది పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ సింహాద్రి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ..పేదల, వెనుకబడిన తరగతుల, మైనార్టీల అభివృద్ధికి కుల గణనన ఎంతో తోడ్పడుతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో చేపడుతున్న కుల గణనలో రాష్ట్ర ప్రభుత్వం, అధికార యంత్రాంగం అనుకున్నంత ప్రాధాన్యత ఇవ్వడం లేదని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ సైతం తగిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ చరిత్రలో కుల గణనన అత్యంత కీలకమైన నిర్ణయం అన్నారు. గ్రామ సమస్యలతో ముడిపెట్టి, పేదలకు, స్త్రీలకు, రైతులకు వచ్చే ప్రభుత్వ అవకాశాలను తీసివేస్తారని ప్రచారం చేస్తున్నట్లుగా ఆయన వివరించారు. కావునా కుల గణన ప్రాధాన్యతను పెంచడానికి ముఖ్యమంత్రి, మంత్రులు పాదయాత్రలు చేపట్టాలని సూచించారు.

దేశ భవిష్యత్తును నిర్ణయించేది యువ ఓటర్లే



సనత్‌నగర్: దేశ భవిష్యత్తును నిర్ణయించేది యువ ఓటర్లేనని సామాజికవేత్త పుట్నాల రాజేశ్వర్ అన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఓటరు నమోదు శిబిరాలను సనత్‌నగర్‌కు చెందిన వివిధ పక్షాలకు చెందిన వారితో కలిసి ఆదివారం పరిశీలించారు. సనత్‌నగర్ రౌండ్ టేబుల్ స్కూల్ వద్ద శిబిరంలో ఓటరు నమోదు, పాత ఓట్లకు సంబంధించి ఉన్న సవరణ, ఇతరత్రా ప్రాంతాలకు తమ ఓట్లను మార్చుకునేందుకు వీలుగా పలువురు చేసుకుంటున్న దరఖాస్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు.

బండి సంజయ్ వ్యాఖ్యలు అవగాహన రాహిత్యం

ఉస్మానియా యూనివర్సిటీ: కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై విద్యార్థి సంఘం నాయకులు ఆదివారం మండిపడ్డారు. తెలంగాణ విద్యా కమిషన్‌లో నక్సలైట్ భావజాలం గల వ్యక్తులు ఉన్నారని అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆయన అవగాహన రాహిత్యమని పీడీఎస్‌యూ (విజృంభణ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లూరి విజయ్ పేర్కొన్నారు. విద్యా కమిషన్‌పై అర్థరహిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్ కేంద్రమంత్రి పదవికి అనర్హుడని ఓయూ విద్యార్థి నేత వలిగొండ నరసింహ ధ్వజమెత్తారు. విద్యా కమిషన్‌కు చైర్మన్‌గా, ఇతర అధికారులు సీఎం రేవంత్‌రెడ్డి ఐఏఎస్ అధికారి, వర్సిటీల ప్రొఫెసర్లు, పీహెచ్‌డీ డాక్టరేట్లు చేసిన వ్యక్తులను నియమిస్తే వారు నక్సలైట్ భావజాలం అని బండి సంజయ్ పేర్కొనడం సిగ్గుచేటు అని మండిపడ్డారు.

ఎస్ఎఫ్ఐ ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ నూతన కమిటీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్ఎఫ్ఐ ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ నూతన కమిటీని ఆదివారం ప్రకటించారు. అధ్యక్షుడిగా కార్తీక్, ప్రధాన కార్యదర్శిగా మనోజ్, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, ఈశ్వర్, ముత్తయ్, జాయింట్ సెక్రెటరీలుగా రాకేష్, సాయిభర్గవ్ రెడ్డి, రోహిత్‌ను రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి నియమించిన్నట్లు ఓయూ అధ్యక్షుడు రవినాయక్ తెలిపారు.

వర్సిటీల్లో ఖాళీలను భర్తీ చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ వర్సిటీల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆర్ట్స్ కాలేజీ 121 తరగతి గదిలో ఏఐఎస్ఎఫ్ ఓయూ కౌన్సిల్ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వానికి, ఉన్నత విద్యా మండలి అధికారులకు, వైస్ చాన్స్‌లర్లకు 8 ప్రతిపాదనలు చేశారు. వర్సిటీలో ఖాళీల భర్తీ, ప్రతి విద్యార్థికి హాస్టల్ వసతి, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ విడుదల, వర్సిటీల్లో విద్యార్థి సంఘం ఎన్నికలు, నూతన విద్య విధానానికి వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని తదితర అంశాలను ప్రతిపాదించిన్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, ఓయూ అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్, నెల్లి సత్య, నగర అధ్యక్షులు చైతన్యయాదవ్ పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం లక్ష్య పుష్పార్చన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరించారు. కార్తీక మాసంలో ప్రతీ ఆదివారం లక్ష్య పుష్పార్చన పూజలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.23, నల్లవంకాయ 55, పొడుగు వంకాయ 40, బెండకాయ 55, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 60, క్యాప్సికం 75, పచ్చకాకర 32 పందిరి బీర 45, క్యాబేజీ 35, క్యారెట్ 77, దొండ 25, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 75, గోకరకాయ 45, కీర 17, దోసకాయ 35, బీట్‌రూట్ 55, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 38, చామగడ్డ 40, మొరంగడ్డ 28, కందగడ్డ 65, సొరకాయ 15, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.